సాక్షి శ్రీకాకుళం

మంగళవారం ♦ 9 ♦ ఏప్రిల్ ♦ 2024



ఆస్పత్రుల్లో వినూత్న ప్రయోగం


ఆస్పత్రుల్లో టీవీలతో అవగాహన కల్పిస్తున్నారు. టెక్కలిలో మూడు టీవీలు ఏర్పాటు చేశారు.

- 2లో



ముగిసిన టెన్త్ మూల్యాంకనం

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం ముగిసింది. ఏప్రిల్ ఒకటో తేదీన మొదలుపెట్టి 1.85 లక్షల జవాబుపత్రాలను సోమవారం సాయంత్రంతో దిద్దారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ	బుధ
సాయంత్రం	ఉదయం
6.13	4.26

న్యూస్‌రీల్

98.98 శాతం పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ సోమవారం సాయంత్రం నాటికి 98.98 శాతం పూర్తయ్యింది. ఈ సారి వలంటీర్లు లేకపోవడంతో నేరుగా సచివాలయాల్లో అందజేశారు. దీంతో కాస్త ఆలస్యమైంది. 732 గ్రామ వార్డు సచివాలయాల్లో ఈ పింఛన్ల పంపిణీ చేపట్టగా.. 3,21,689మందికి గాను 3,18,392 మందికి పింఛన్లు అందజేశారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని ప్రాంతాల్లో తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. విజయవాడ సెక్రటేరియట్‌లోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి సోమవారం మధ్యాహ్నం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వేతన ఉత్పత్తి, వేసవిలో విద్యుత్ సరఫరా, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో కలెక్టర్ మాట్లాడుతూ నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తాగునీటి సమస్యకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా ప్రజలు ఈ దిగువ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉన్నాయని, ఈ నంబర్లు ప్రతి రోజు 24 గంటలు పాటు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

నంబర్లు ఇవే..

ఆర్‌డబ్ల్యూఎస్	9100120602
డ్వామా	6309900660
ఏపీఈపీడీసీఎల్	9490612633

ఇచ్ఛాపురానికి మరో రైలు సేవలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో మరో రైలు బ్రహ్మపురం–ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. 06087/06088 నంబర్ గల 22 సెకండ్ క్లాస్ బోగీలతో కూడిన బ్రహ్మపురం–ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆగింది. ఈ రైలు బ్రహ్మపురంలో మధ్యాహ్నం 12.40కు బయల్దేరి ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ నుంచి విజయవాడ గూడురు మీదుగా తమిళనాడుకు అక్కడి నుంచి ఎర్నాకులం చేరుకుంటుందని స్థానిక రైల్వేస్టేషన్ అధికారులు తెలిపారు.

నకిలీ నోట్ల పట్టివేత



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం అంతర్ చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన ఎన్నికల తనిఖీల్లో భాగంగా సోమవారం సుమారు రూ.10లక్షల నకిలీ నోట్లు దొరికాయి. జేఆర్‌పురం, పైడిభీమవరం చెక్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం విజయనగరం నుంచి ఒడిశా రాష్ట్రంలోని జెట్నీ వెళ్లేందుకు ముగ్గురు వ్యక్తులు కారులో బయల్దేరారు. పైడిభీమవరంలో చెక్‌పోస్టు పోలీసులు కారును తనిఖీ చేయగా ఈ నోట్లు కనిపించాయి. వెంటనే జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌కు కారు డ్రైవర్‌తో సహా వెనుక కూర్చున్న ఇద్దరు వ్యక్తులను తరలించారు. అక్కడ నోట్లు లెక్కించగా 1943 నకిలీ రూ.500 నోట్లు, మరో 20 ఒరిజినల్ రూ.500 నోట్లు ఉన్నాయి. నకిలీ నోట్లు చిన్న పిల్లలు ఆడుకునేవిగా ఉన్నాయి. మొత్తంగా రూ.9,81,500 నగదు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో విజయనగరానికి చెందిన హరి శ్రీను, గొర్లె రామచంద్రరావు, పలాస మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన జన్నా సునీల్ ఉన్నారు. ఈ ముగ్గురిపై జేఆర్ పురం ఎస్ఐ కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వీరిలో డ్రైవర్ జన్నా సునీల్‌పై గతంలో కేసులు నమోదై ఉన్నాయి. వీరు ఒక లక్షకి పది లక్షలు ఇస్తామని మాయమాటలు చెప్పి డూప్లికెట్ నోట్లు ముట్టచెప్పుతున్నట్లు విచారణలో తేలింది.



మావిచిగురు తిని.. మీకు శుభమని..


ఆరు రుచుల పచ్చడి ప్రతి ఇంటా సిద్ధమవుతోంది. పంచాంగ పఠనాన్ని పల్లె చెవులొగ్గి వింటోంది. శోభకృత్‌కు సెలవు ప్రకటిస్తూ ప్రకృతి క్రోధికి స్వాగతం పలికింది. సార్వత్రిక ఎన్నికల సమయం కావడం ఈ ఉగాది ప్రత్యేకత. బతుకులో నవ వసంతాలను కోరుతూ సామాన్యులు, చైత్రంలో రాజకీయ ఉన్నతి రావాలని నాయకులు కొత్త ఏడాదిని కోటి ఆశలతో ఆహ్వానిస్తున్నారు.



కంచిలి: కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉగాది వేడుకల్లో విద్యార్థులు

- జిల్లాకు ఉగాది శోభ
- రాజకీయ లోగిళ్లకు వెలుగు తెచ్చే ఉగాది
- క్రోధి నామ సంవత్సరానికి సిక్కోలు స్వాగతం

శ్రీకాకుళం కల్చరల్: వసంత రుతువు ఆగమనాన్ని ప్రకృతి ఘనంగా చాటింది. శిశిరం నుంచి చైత్రానికి మళ్లిన కాలం చివురుటాకులకు ఊపిరులూదింది. నూతన నాయకుల పుట్టుక, రాజకీయ పలకరింపులతో ఈ క్రోధినామ సంవత్సరం ప్రారంభం కానుండడం విశేషం. క్రోధి నామ సంవత్సరం వస్తూనే ఎన్నికలను తీసుకువచ్చింది. ఈ కొత్త వత్సరం పలు పార్టీల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. అందరూ గెలవాలని పరితపిస్తున్నారు. ఆత్రుతగా రాశి ఫలితాలు చూసుకుంటున్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి రోజు ఉగాది పండుగ జరుపుకుంటారు. ఉగాది రోజున ఆరురుచులతో పచ్చడి చేసి ఇష్టదైవానికి నైవేద్యంగా సమర్పించి భక్తితో పూజలు చేస్తారు. దీన్ని ప్రసాదాలను స్వీకరిస్తారు. ఉగాది అంటేనే వేప పచ్చడికి



ప్రత్యేకత. బెల్లం, చింతపండు, మామిడి పిందెలు, వేపపూత, పచ్చిమిరప, ఉప్పు వేసి వేపపచ్చడిని షడ్రషోపేతంగా తయారు చేస్తారు. ఈ పచ్చడి శ్రీరామనవమి వరకు తినాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

రాజకీయ పంచాంగం

ఉగాది నాడు పంచాంగ శ్రవణం తప్పనిసరిగా ఉంటుంది. పంచాంగం తిథి, వారం, నక్షత్రం,యోగం, కరణంల కలయిక. పంచాంగ పఠనంలో ప్రధానంగా ఆ సంవత్సర ఫలితాలు వివరిస్తారు. నవ నాయకులను తెలుసుకొని వారి ద్వారా ఫలాలను అంచనావేస్తారు. ఈ ఏడాది అన్నీ రాజకీయ పంచాంగ పఠనాలే ఎక్కువగా వినిపిస్తాయి.

ఏరువాకకు సిద్ధం..

ఈ రోజునే రైతన్నలు తమ హలాలకు(నాగళ్లకు)పూజలు చేస్తారు. పొలంలో ఏరువాక చేసేందుకు తొలి ముహూర్తం పెట్టుకుంటారు. వేకువనే ఏరు పూసేందుకు సామగ్రిని సిద్ధం చేశారు. అమావాస్య రోజున నాగలితో పొలంలో ఏరు పూయడం ఆనవాయితీ. అలాగే ఈ ఉగాది రోజునుంచి నాయకులు తమ ప్రచార రథాలతో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తూ, వీలైతే ఆకర్షణలు పంచుతూ ప్రచారాన్ని కొనసాగిస్తారు.



● సైకత శుభాకాంక్షలు

ఉగాది సందర్భంగా సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత శుభాకాంక్షలు తెలియజేశారు. గాజులకొల్లివలస సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సోమవారం ఇసుకతో వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. - ఆమదాలవలస రూరల్

అనుకూల మీడియాతో పబ్బం గడుపుతున్నారు

- చంద్రబాబుపై మంత్రి ధర్మాన ధ్వజం

జలుమూరు: చంద్రబాబు తన అనుకూల మీడియాతో పబ్బం గడుపుతున్నారని, ఆయనకు శ్రీకాకుళం జిల్లా అంటే ఎప్పుడూ చిన్నచూపేనని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన సోమవారం చల్లవానిపేట పద్మావతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జలుమూరు–సారవకోట మండలాల కార్యకర్తల ఆత్మీయ కలయికలో మాట్లాడారు. విభజన సమయంలో జిల్లాలో ఒక్క కేంద్ర సంస్థనైనా ఏర్పాటు చేయలేదని గుర్తు చేశారు. దీనికి భిన్నంగా గత ఐదేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్ జిల్లాలో ఎన్నో ప్రాజెక్టులు ప్రారంభించారని తెలిపారు. హిరమండలంలో వైఎస్సార్ సుజలధార, పలాసలో కిడ్నీ ఆస్పత్రి, మూలపేటలో పోర్టు, బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు వైఎస్ జగన్ చొరవతోనే జరిగాయన్నారు. రిమ్స్‌ను అభివృద్ధి చేసి పోస్టులు భర్తీ చేశారని చెప్పారు. కరోనా సమయంలో తాను కూడా రిమ్స్‌లోనే చికిత్స చేయించుకున్నానని చెప్పారు. అదే సమయంలో చంద్రబాబు కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లిపోయారని గుర్తు చేశారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల దోపిడీ తప్ప ఇంకేమీ జరగలేదన్నారు. వైఎస్సార్ సీపీ పేదల అవసరాలు తీరుస్తుంటే.. టీడీపీ పెత్తందార్లకు వత్తాసు పలుకుతోందని విమర్శించారు. ధర్మాన సోదరులు వైఎస్ కుటుంబానికి విధేయులని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు. చిత్రంలో కృష్ణదాస్, పేరాడ తిలక్

రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య, ధర్మాన రామ్‌దాస్, ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, వైస్ ఎంపీపీలు తంగి మురళీకృష్ణ, జి.రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణి, అల్లాడ, చల్లవానిపేట, సారవకోట సొసైటీ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, పి.రాజప్పల నాయుడు, జి.వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, వరుదు వంశీకృష్ణ, నక్క తులసీదాస్, మండల సలహాదారు పి.వితలరావు, వి.విజయ్, కోన దామోదరరావు, దామ మన్మధరావు, వాన నాగేశ్వరరావు తోపాటు పెద్ద ఎత్తున సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురు అర్చకులకు జిల్లా స్థాయి ఉగాది పురస్కారాలు

అరసవల్లి: క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వ దినం సందర్భంగా జిల్లా స్థాయిలో ముగ్గురిని ఉత్తమ అర్చకులుగా ఎంపిక చేశామని జిల్లా దేవదాయ శాఖాధికారి బీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్ తెలియజేసారు. శ్రీనివాసాచార్యులు (శ్రీకాకుళం–శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయం, దూదివారికోవెల), సీహెచ్ జగన్నాథాచార్యులు (పాతపట్నం–శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం), ఇప్పిలి సూర్యనారాయణ మూర్తి (క్లోపల్లి–శ్రీమణి నాగేశ్వర స్వామి వారి ఆలయం)లకు జిల్లా స్థాయి ఉగాది పురస్కారాలను జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో మంగళవారం జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో అందజేయనున్నామని ప్రకటించారు. రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు వీరికి చెరో రూ.10,116 నగదుతో పాటు వస్త్రాలు, ప్రశంసా పత్రం అందజేస్తామని తెలియజేశారు.

అరసవల్లి ఆదిత్యాలయంలో..

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు నిర్వహించనున్నామని ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు తెలియజేశారు. అలాగే ఉత్తమ అర్చకులుగా ఇప్పిలి కాశ్యపశర్మ, ఇప్పిలి ఫణీంద్రశర్మ, వేద పారాయణదారుడు ధర్భముళ్ల శ్రీనివాస శర్మలకు ఈ ఏడాదికి ఉగాది పురస్కారాలను అందజేస్తున్నామని ప్రకటించారు. వీరికి రూ.10,116 నగదు, ప్రశంసాపత్రాలను అందజేస్తామని వెల్లడించారు. అలాగే మంగళవారం ఉదయం, సాయంత్రం కూడా ఉగాది పంచాంగ పఠనం అనివెట్టి మండపంలో నిర్వహించనున్నట్లుగా ప్రకటించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు చేపట్టి 24 గంటల్లో దాన్ని పరిష్కరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులతో సాధారణ ఎన్నికలు–2024 నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా మండల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఎన్నికలకు సంబంధించి ఆర్‌ఓలు, నోడల్ అధికారులు చేపడుతున్న పనులపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ముందస్తు అనుమతులు లేకుండా వారు పని చేస్తున్న కేంద్రాన్ని విడిచి వెళ్లరాదన్నారు. నిబంధనలు మీరిన అధికారులపై వేటు తప్పదన్నారు. పోలింగ్, కౌంటింగ్‌కి సంబంధించి నిర్దేశించిన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉన్నాయో లేదో ముందుగా చూసుకోవాలని, ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది వారికి అప్పగించిన బాధ్యతలను అప్రమత్తంగా నిర్వహించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

48 గంటలు దాటినా కొన్ని శాఖలు రోజు వారీ ఎన్నికల నివేదికలు అందజేయడం లేదని, 13వ తేదీలోగా పోస్టల్ బ్యాలెట్ ప్రతిపాదనలు పంపాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఇంకా 18 రకాల స్టేషనరీ ఎన్నికల సంఘం నుంచి రావాల్సి ఉందని, వాటిని త్వరగా తెప్పించాలని సంబంధిత నోడల్ అధికారిని ఆదేశించారు. పోలింగ్ రోజున 450 వాహనాలు సిద్ధం చేయాలని, అవి కాకుండా అదనంగా 104 టాటా మ్యాజిక్ వాహనాలు సిద్ధం చేయాలని రవాణా నోడల్ అధికారికి సూచించారు. అన్ని చెక్ పోస్టుల్లో వెబ్ కాస్టింగ్ కచ్చితంగా ఉండాలన్నారు.

నామినేషన్ల స్వీకరణ సమయం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకూ మాత్రమేనని, మొత్తం ప్రక్రియను వీడియో గ్రఫీ చేయాలని, డీఎస్పీ స్థాయి అధికారి బందోబస్తు నిర్వహించాలని చెప్పారు.

సీఎం జగన్‌కు సెల్యూట్..

‘శ్రీకాకుళం జిల్లా ఉద్దాన ప్రాంతంలో ఉన్న కిడ్నీ బాధితుల కోసం కిడ్నీ రీసెర్చ్ సెంటర్, వాటర్ గ్రిడ్ నిర్మించడం భగీరథ ప్రయత్నం. పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సెల్యూట్. ఇన్ని కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆస్పత్రి.. ప్రభుత్వ పనితీరుకి తార్కాణం. అలాగే రూ.700 కోట్లతో మంచినీటి ప్రాజెక్ట్ నిర్మాణం అద్భుతం. నేను ఏ పార్టీకీ చెందిన వ్యక్తిని కాను. ఏ ప్రభుత్వం మంచి చేసినా స్వాగతించాలి.’ – ఆర్.నారాయణమూర్తి, సినీ నటుడు, దర్శకుడు



ఇదికదా.. అభివృద్ధి

-కాశీబుగ్గ



క్లుప్తంగా

'న్యాయ సహాయం కోరే ఖైదీల వివరాలు తెలుసుకోండి'



పారాలీగల్ వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసి నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయ సహాయం కావాలనుకునే జైలు ఖైదీలను గుర్తించి వివరాలు సేకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆయన సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యలయంలో పారాలీగల్ వలంటీర్లతో ఒరియెంటేషన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జైలులో ముద్దాయిలు, ఎవరైనా బెయిల్ వచ్చినా షూరిటీ పెట్టుకునే పరిస్థితి లేక జైల్లో మగ్గుతున్న వారి వివరాలు తెలుసుకోవాలన్నారు. అలాంటి వారి వివరాలు సేకరించి సాయం చేయాలన్నారు. జైల్లో ఉన్న మహిళా ఖైదీల కేసుల వివరాలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వాళ్ల వివరాలు తెలుసుకోవాలన్నారు. మానసిక ఆరోగ్యం సరిగా లేని వారిని గుర్తించాలన్నారు

సిక్కోలు అమరులకు నివాళులు



అమరవీరుల విగ్రహాల ముందు నివాళులర్పిస్తున్న బైరి నరేష్

పలాస: శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాటంలో అమరులైన విప్లవ కారుల స్థూపాల వద్దకు వెళ్లి బైరి నరేష్ వారికి నివాళులర్పించారు. ఇటీవల మందసలో జరిగిన పూలదండల మార్పిడి పెళ్లికి పెద్ద దిక్కుగా వచ్చిన తెలంగాణకు చెందిన మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు బైరి నరేష్ సోమవారం పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా అమరవీరుల జ్ఞాపకార్థం ప్రజలు నిర్మించుకున్న స్థూపాలు, విగ్రహాలు వద్దకు వెళ్లి వారికి జోహార్లు చెప్పారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకులు, వివిధ ప్రజాస్వామిక వాదులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజును కూడా కలిసి వారి సేవలను అభినందించారు.

పెట్రోల్ దొంగల హల్‌చల్

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో పెట్రోల్ దొంగలు హల్‌చల్ చేయడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో పట్టణంలో కొన్ని వీధుల్లో ఇళ్ల ముంగిట పార్కింగ్ చేసిన వాహనాల నుంచి పెట్రోల్‌ను దొంగతనం చేయడమే కాకుండా వాహనాల వస్తువులు చోరీ చేశారు. దీంతో వాహనదారులంతా భయాందోళన చెందుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం ఇదే మాదిరిగా పెట్రోల్ దొంగతనాలు చేసిన దొంగలు కొంత కాలం స్తబ్దతగా ఉంటూ మరో సారి రెచ్చిపోయారు.



సోంపేట: మేజర్ పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద



సరుబుజ్జిలి: తురకపేటలో ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని



ఎల్.ఎన్.పేట: ఎమ్మెల్యే రెడ్డి శాంతికి పూలతో స్వాగతం పలుకుతున్న వృద్ధురాలు



టెక్కలిలో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్

• పతాక స్థాయిలో..

ఎన్నికల ప్రచారాలు పతాక స్థాయిలో జరుగుతున్నాయి. అభ్యర్థులు అన్ని వర్గాల వారిని పలకరిస్తూ.. ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇంటింటికీ వెళ్తూ ఆశీర్వాదాలు కోరుతున్నారు.



పోలాకి: ఎన్నికల చట్టాలు, నియమావళి పుస్తకాలను ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గణేష్‌నాయుడు



మందస: మామిడిపల్లి గ్రామంలో వృద్ధాప్య పింఛన్‌దారుడు కిక్కర అదవయ్యతో ముచ్చటిస్తున్న మంత్రి అప్పలరాజు



జి.సిగడాం: గెద్దకంచరాంలో ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్

వైఎస్సార్‌సీపీలోకి వెల్లువలా చేరికలు



పలాస: వైఎస్సార్ సీపీలో చేరిన సాబకోట తెలుగుదేశం కార్యకర్తలు



ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీలోకి చేరిన స్వర్ణకార సంఘం కుటుంబ సభ్యులతో జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ

పలాస: మందస మండలం సాబకోట గ్రామానికి చెందిన 16 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజు పలాస మండలం మామిడిపల్లిలో తన ఎన్నికల ప్రచారం చేస్తుండగా అక్కడకు చేరి వారంతా మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని మంత్రి సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక నుంచి వైఎస్సార్ సీపీ కోసం పనిచేసి పార్టీని ఎన్నికల్లో గెలిపిస్తామన్నారు.

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం: వైఎస్సార్ సీపీ పాలన నచ్చి పార్టీలో చేరుతున్నారని జిల్లాపరిషత్ చైర్మన్, నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోగల కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘానికి చెందిన 40 కుటుంబాలు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక రోటరీ ఫంక్షన్ హాల్‌లో స్వర్ణకార సంఘానికి చెందిన కుటుంబ సభ్యులకు ఆమె పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్లు పిలక రాజలక్ష్మి, లాభాల స్వర్ణమణి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జేసీఎస్ అధ్యక్షుడు సాలిన ఢిల్లి, యూత్ అధ్యక్షుడు పరపటి కోటి, కౌన్సిలర్లు సుగ్గ ప్రేమ్ కుమార్, బచ్చు జగన్, పల్లంటి మధుమూర్తి, కంచికామాక్షి స్వర్ణకారసంఘం అధ్యక్షులు శంకర్‌ఆచారి, పార్టీ నాయకులు పిలక సంతు, పిలక విజయ్ బాస్కర్, సీలాపు డిల్లి, టెంక లోకేష్, పోతల ఈశ్వర్‌రెడ్డి, లోహిదాస్ కిరణ్ బెహర, ఎండీ షఫీ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో వినూత్న ప్రయోగం



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన టీవీలను చూస్తూ, సూచనలు వింటున్న గర్భిణులు

టెక్కలి రూరల్: ఆంధ్ర ప్రదేశ్ వైద్య విధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో నూతనంగా టీవీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా టెక్కలి జిల్లా ఆస్పత్రిలో నూతనంగా 3 టీవీలను గర్భిణుల చెకప్ వార్డు ముందు, డెలివరీ రూమ్‌లోనూ, ఆపరేషన్ థియేటర్ వద్ద ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు తెలిపారు. ఈ టీవీల ద్వారా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. అంతే కాకుండా బాలింతలు తమ పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా నిపుణులతో వీడియోలు చేయించి ఇక్కడ ప్రదర్శిస్తారు. వారికి ఏదైనా సమస్య వస్తే ఎలా గుర్తించాలి, డాక్టర్‌ను ఎప్పుడు సంప్రదించాలి అన్నదానిపై ఆ తల్లులకు టీవీల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ టీవీల ద్వారా వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

చాలా ఉపయోగపడుతుంది..



ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ టీవీల ద్వారా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల నుంచి వీడియోలు ప్రదర్శిస్తున్నాం. పిల్లలకు ప్రధానంగా వచ్చే సమస్యల గురించి ఏ విధంగా తెలుసుకోవాలో అవగాహన కల్పించడం జరుగుతుంది.

– బి.సూర్యారావు, టెక్కలి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

'తండేల్' సాంకేతిక బృందం సందర్శన



తండేల్ సినిమా దర్శకుడు చందు మొండేటికి బొకే అందజేస్తున్న కొత్తమత్స్యలేశం యువకుడు

ఎచ్చెర్ల క్యాంపస్: నాగచైతన్య, సాయి పల్లవి నటిస్తున్న 'తండేల్' సినిమా సాంకేతిక బృందం సోమవారం కొత్తమత్స్యలేశం గ్రామాన్ని సందర్శించింది. గతంలోనూ పలుమార్లు వీరు వచ్చారు. స్థానికంగా లొకేషన్లు పరిశీలించారు. ఈ నెల చివరిలో పది రోజుల పాటు ఇక్కడే నివాసం ఉండి షూటింగ్ చేయనున్నట్లు తెలిపారు.

'మా సినిమాలో హీరో శ్రీకాకుళం మత్స్యకారుడే'

అరసవల్లి: పాకిస్తాన్ సైన్యానికి చిక్కిన శ్రీకాకుళం జిల్లా మత్స్యకారుడి తెగువ, ధైర్యసాహసాలు, స్థానిక జీవన విధానంపైనే తమ 'తండేల్' సినిమా రూపుదిద్దుకుంటోందని ప్రముఖ సినీ దర్శకుడు చందు మొండేటి అన్నారు. సోమవారం ఉదయం ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అంతరాలయంలో ప్రత్యేకంగా స్వామికి ప్రత్యేక పూజలతో మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలం కొత్త దిబ్బల పాలెం మత్స్యకారుడు రామారావు వాస్తవిక కథను, పాకిస్తాన్‌లో జరిగిన ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని, నాగచైతన్య, సాయి పల్లవి హీరోహీరోయిన్లుగా గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో ఈ చిత్రం త్వరలో విడుదల కానుందని వెల్లడించారు. 'తండేల్' నాగచైతన్య కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోనుందన్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై శ్రీకాకుళం యాసలోనే తెరకెక్కిస్తున్నామని, సినిమా త్వరలోనే రిలీజ్ కానుందని వివరించారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



చెరువులో నుంచి బుడ్డెపు నీలాద్రి మృతదేహాన్ని వెలికితీసిన అగ్నిమాపక సిబ్బంది

కంచిలి: మఠం కంచిలిలో గల మఠం చెరువులో జెన్నాగాయి గ్రామానికి చెందిన బుడ్డెపు నీలాద్రి(42) అనే వ్యక్తి చెరువులో మునిగి చనిపోయారు. నీలాద్రి సోమవారం తన భార్యతో కలిసి కంచిలిలో కూలి పనికి వచ్చారు. మధ్యాహ్నం స్నానం చేస్తానని చెరువులో దిగాడు. కొద్దిసేపటికి ఊపిరాడక నీళ్లు తాగి మృతి చెందాడు. మృతునికి భార్య జానకి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న సోంపేట అగ్నిమాపక శకటం సిబ్బంది వాహనంతో వచ్చి చెరువులో దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికే నీలాద్రి మృతి చెందాడని తెలిపారు. పేద కుటుంబానికి చెందిన ఈ వ్యక్తి మృతిచెందడంతో భార్య, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ డి.భాస్కరరావు, సిబ్బంది ఆర్.సింహాచలం, వై.ఈశ్వరరావు, కేవీ రమణ, బి.బాబూరావు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని భార్య జానకి ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ వి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానిక సర్పంచ్ గణప సింహాచలం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

ఎండ తీవ్రతకు వృద్ధుడు మృతి



మృతి చెందిన వృద్ధుడు

టెక్కలి రూరల్: మండలంలోని బూరగాం పంచాయతీ పరిధిలోని మాదినవాణి పేట గ్రామానికి చెందిన నక్క లచ్చయ్య(77) అనే వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. లచ్చయ్య తన ఇంటి నుంచి సోమవారం ఉదయం 10 గంటల సమయంలో తన వ్యక్తిగత పనుల కోసం బయటకు వెళ్తుండగా ఒక్కసారిగా కిందకు పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం స్థానికుల సలహా మేరకు రెవెన్యూ అధికారికి సమాచారం అందించారు. అయితే వీఆర్ఓ మల్లేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకునేలోపే అంత్యక్రియలు నిర్వహించారు.

'బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం'

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో అనారోగ్యంతో ఇటీవల మరణించిన కొత్తూరు పీఎస్ హెడ్ కానిస్టేబుల్ సవర అనప, గార పీఎస్ కానిస్టేబుల్ బురా సురేష్ కుటుంబాలకు అండగా ఉంటామని జీఆర్ రాధిక అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వీరి కుటుంబాలకు ఎస్పీ చేతుల మీదుగా నగదు చెక్‌లను అందజేశారు. రాష్ట్ర డీజీపీ శాఖాపరంగా మంజూరు చేసిన విడోఫండ్ రూ. 50 వేలు, ఫ్లాగ్‌ఫండ్ రూ. 25 వేలు చెక్కులను సవర అనప, బురా సురేష్ భార్యలు లక్ష్మి, పద్మావతిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇరువురి మరణం చాలా బాధాకరమని, జిల్లా పోలీసు శాఖకు తీరని లోటని, శాఖాపరంగా రావాల్సిన మిగిలిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చూస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, ఏఆర్ డీఎస్పీ ఎల్ శేషాద్రినాయుడు, పరిపాలనాధికారి సీహెచ్ గోపీనాథ్ పాల్గొన్నారు.